సాక్షి అనకాపల్లి

బుధవారం ; 21 ; జూన్ ; 2023



సమస్యల పరిష్కారానికి కృషి

గ్రామాల్లో ప్రధాన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని మంత్రి అమర్‌నాథ్ సూచించారు. 8లో



సంస్కృతికి ప్రతీక పండగలు

గ్రామాల్లో నిర్వహించే పండగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. 8లో

మోస్తరు వర్షసూచన

అనకాపల్లిటౌన్ : రాగల ఐదురోజులు వర్షసూచన ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త కుమారి తెలిపారు. ఈ నెల 21, 22, 23న వరుసగా 15, 8, 25 మి.మీ., 24, 25న 6, 10 మి.మీ. చొప్పున వర్షం కురుస్తుందన్నారు. ఉష్ణోగ్రతలు 33 నుంచి 36 డిగ్రీలు, గాలిలో తేమ 80-82 శాతం, గాలి గంటకు 8 నుంచి 10 కి.మీ. వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

ఏపీ డీఈఈ సెట్‌లో సత్తా



మరియమ్మ రాహేలు మైథిల్

కోటవురట్ల: ఏపీ డీఈఈ సెట్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థులు సత్తా చాటారు. పెదపల్లి మరియమ్మకు రాష్ట్ర స్థాయిలో 4, కిర్రా రాహేలు 25 ర్యాంకు సాధించారు. అలాగే ఇటీవల జరిగిన ఏపీఆర్జీసీలో ఇదే కళాశాలకు చెందిన పి.నరేంద్ర మైథిల్ రాష్ట్ర స్థాయిలో 49 ర్యాంకు సాధించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ పి.కొండబాబు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నేడు కేంద్రమంత్రి మురళీధరన్ రాక

అనకాపల్లి రూరల్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. సిరసపల్లి చింతామణి దత్త క్షేత్రంలో జరగనున్న యోగా డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి వి.మురళీధరన్ హాజరుకానున్నారు. ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయనతోపాటు సెయిల్ డెరెక్టర్ సాగి కాశీ విశ్వనాథ రాజు కూడా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. అలాగే పట్టణంలోని విజయా రెసిడెన్సీలో సాయంత్రం 5 గంటలకు ఆలోచన స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించనున్న మేధావుల సమావేశంలో కూడా మంత్రి పాల్గొనున్నారు.కేంద్రంలో మోదీ 9 ఏళ్ల సుపరిపాలనపై చర్చ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రోలుగుంట ఎస్ఐకి ఎస్పీ ప్రశంస



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రోలుగుంట ఎస్ఐ నాగకార్తీక్

రోలుగుంట: స్థానిక ఎస్ఐ బి.నాగకార్తీక్‌కు ఎస్పీ నుంచి ప్రశంసలు లభించాయి. తప్పించుకు తిరుగుతున్న గంజాయి కేసుల్లోని నిందితులైన 12 మందిని గత నెలలో చాకచక్యంగా పట్టుకుని రిమాండ్‌కు తరలించిన ఎస్ఐ నాగకార్తీక్‌కు మంగళవారం ఎస్పీ మురళీకృష్ణ ప్రశంసాపత్రం అందజేశారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

23 నుంచి రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

అనకాపల్లిటౌన్: రాష్ట్రస్థాయి 10వ పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ స్త్రీ, పురుషుల పోటీలు ఈనెల 23, 24, 25 తేదీల్లో నెల్లూరులో జరుగుతాయని జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి బి.బద్రీనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి మహిళల 52 కేజీల విభాగంలో ఆర్.పూర్ణ, పురుషుల 83 కేజీల విభాగంలో ఎ.సతీష్, 93 కేజీల విభాగంలో ఎం.కె.లలితేశ్వరరావు, పి.దినేష్‌లు, బెంచ్ ప్రెస్ పోటీల్లో 59 కేజీల విభాగంలో ఐ.ప్రవీణ్ కుమార్, 66 కేజీల విభాగంలో ఎ.సురేష్, 74కేజీల విభాగంలో జి.స్వామి, 83కేజీల విభాగంలో సతీష్, ఎ.గణేష్‌లు ఎంపికైనట్టు ఆయన తెలిపారు.

26 నుంచి లెప్రసీ సర్వే

- కేసులను పక్కాగా గుర్తించాలి: ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో జ్యోతి



సర్వే గురించి వివరిస్తున్న జ్యోతి

అనకాపల్లి రూరల్: జిల్లాలో ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16 వరకూ చేపట్టనున్న లెప్రసీ కేసుల గుర్తింపు సర్వేను కచ్చితత్వంతో చేపట్టాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో జ్యోతి సూచించారు. మంగళవారం తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలకు ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ డెటెక్షన్ క్యాంపెయిన్) సర్వేపై శిక్షణనిచ్చారు. కుష్టు వ్యాధి లక్షణాలు,సోకడానికి కారణాలు,వ్యాధి నిర్ధారణ, చికిత్స తదితర విషయాలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు వాణీజగదీశ్వరి,సుమేధా మేఘన, సీహెచ్‌వో శారద,ఎంపీహెచ్ఎస్ బీ సంగం,ఎం మరియమ్మ,ఎం .మాణిక్యాంబిక పాల్గొన్నారు.

మన చెంతనే అధునాతన వైద్యం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కల త్వరలోనే సాకారం కాబోతోంది. 52.15 ఎకరాల్లో 630 పడకలతో రూ.500 కోట్లతో నిర్మిస్తున్న ఆస్పత్రి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 30నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి.

- జిల్లా ప్రజలకు వరంలా భీమబోయిన పాలెం ప్రభుత్వ మెడికల్ కాలేజీ
- 52.15 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో శరవేగంగా నిర్మాణ పనులు
- అందుబాటులోకి రానున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, 630 బెడ్స్
- 30 నెలల వ్యవధిలో సాకారం చేయాలని సంకల్పం



మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల



మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి(ఫైల్)

సాక్షి, అనకాపల్లి : అత్యవసర వైద్యం కోసం గ్రామీణ ప్రజలు విశాఖలోని కేజీహెచ్‌కు పరుగుపెట్టాల్సిన పనిలేదు. చికిత్సకోసం వ్యయప్రయాసలు పడి వంద కిలోమీటర్లు వెళ్లాల్సిన అవసరం అంతకన్నా లేదు. నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో 52.15 ఎకరాల్లో ఏర్పాటుకానున్న మెడికల్ కళాశాలతో గ్రామీణ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో జిల్లాలోని ఆరు నియోజకవర్గాల ప్రజలకు మేలు జరగనుంది. ఈ ఆస్పత్రి నిర్మాణంతో అనకాపల్లి జిల్లాతో పాటు అల్లూరి జిల్లాలోని కొయ్యూరు, చింతపల్లి, జీకే వీధి మండలాల గిరిజనులకు సైతం సేవలు అందనున్నాయి.

చురుగ్గా నిర్మాణ పనులు

ఆస్పత్రి నిర్మాణానికి గత ఏడాది డిసెంబర్ 28న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. జనవరి 25న పనుల్ని ప్రారంభించి, 30 నెలల వ్యవధిలో పూర్తి చేయాలన్న లక్ష్యంతో శరవేగంగా జరుపుతున్నారు. ఇప్పటికే ఆరు మాసాలు పూర్తయింది. ఇది అందుబాటులోకి వస్తే ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో విద్యార్థులకు ప్రవేశం లభిస్తుంది. తర్వాత పీజీ వైద్య కోర్సులు వస్తాయి. వారికి వైద్య విద్య బోధించే ప్రొఫెసర్లు(నిపుణులైన వైద్యులు) అందుబాటులోకి వస్తారు. దీంతో గ్రామీణ ప్రజలకు 24 గంటలూ అత్యవసర వైద్యం అందించవచ్చు.

వందేళ్ల తరువాత..

ఉత్తరాంధ్ర ప్రాంతంలో 1921లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. వందేళ్ల తర్వాత అల్లూరి, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే విజయనగరం మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయింది. ఈ ఏడాది అడ్మిషన్లు కూడా ప్రారంభం కానున్నాయి. వచ్చే ఏడాది నాటికి అల్లూరి జిల్లా పాడేరు మెడికల్ కళాశాలలో కూడా అడ్మిషన్లు జరగనున్నాయి. అనకాపల్లి జిల్లాలో తొలుత అనకాపల్లిలో ఏర్పాటు చేయతలపెట్టినా స్థలం సమస్య కారణంగా నర్సీపట్నానికి తరలించారు. ఈ మెడికల్ కళాశాల పాయకరావుపేట, నర్సీపట్నం, యలమంచిలి, మాడుగుల, చోడవరం నియోజకవర్గాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు కేంద్ర బిందువు కానుంది.

అత్యాధునిక సౌకర్యాలు

బి ప్లస్, జి ప్లస్ 5 అంతస్తుల్లో 24 గంటలూ పనిచేసే ఆస్పత్రి, జి ప్లస్ 4 అంతస్తుల్లో ఓపీడీ బ్లాక్, జి ప్లస్ 7 అంతస్తుల్లో ఐపీడీ బ్లాక్ నిర్మించనున్నారు. ఈ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ అండ్ క్యాజువాల్టీ, డయాగ్నస్టిక్స్, డీఈఐసీ అండ్ డీఐఎస్‌హెచ్‌ఏ, రెండు మెటర్నిటీ ఆపరేషన్ థియేటర్లు, 8 మేజర్ ఆపరేషన్ థియేటర్లు, మొత్తం 630 బెడ్స్ ఉంటాయి.

మెడికల్ కాలేజీ

ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్లు ఉంటున్నందున తరగతుల నిర్వహణకు జి ప్లస్ 4 అంతస్తులతో భవన సముదాయం నిర్మించనున్నారు. 8 టీచింగ్ రూములు, 3 మ్యూజియంలు, 8 లేబరేటరీలు, 4 లెక్చర్ థియేటర్లు, 2 ఎగ్జామినేషన్ హాళ్లు, లైబ్రరీ ఉంటాయి.



మెడికల్ కళాశాల నమూనా చిత్రం

నర్సింగ్ కాలేజీ

ఏటా 60 సీట్లలో అడ్మిషన్లు ఉంటాయి. తరగతుల నిర్వహణకు అనుగుణంగా జి ప్లస్ 2 అంతస్తుల్లో భవనాన్ని ప్రత్యేకంగా నిర్మించనున్నారు. వీటితో పాటు యూజీ స్టూడెంట్స్, రెసిడెంట్స్ హాస్టల్స్, స్టాఫ్ అకామిడేషన్, వర్కింగ్ స్టాఫ్ నర్సెస్, నర్సింగ్ స్టూడెంట్స్ హాస్టల్స్, గెస్ట్ హౌస్‌లు ఉంటాయి.

ఎమ్మెల్యే గణేష్ చొరవతో..

మెడికల్ కాలేజీని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత అనువైన స్థలం కోసం మూడు నాలుగు చోట్ల స్థలాలను అధికారులు పరిశీలించారు. ఇందుకోసం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రత్యేక చొరవ చూపించారు. ఆయన కృషి ఫలితంగా భూమి కేటాయింపు, అత్యాధునిక హంగులతో అన్ని వసతులతో మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఇతర భవనాల నిర్మాణానికి మార్గం సుగమమైంది.

30 నెలల్లో పూర్తి చేయాలన్నదే లక్ష్యం



ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 700 మెడికల్ సీట్లు కొత్తగా అందుబాటులోకి వచ్చాయి. అల్లూరి జిల్లా పాడేరులో వచ్చే ఏడాది నుంచి, 2025లో మాకవరపాలెం మెడికల్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. అత్యాధునిక హంగులతో మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఇతర భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఐటీడీ బ్లాక్, 24/7 బ్లాకు శ్లాబ్ పూర్తయింది. మార్చురీ బ్లాక్, మెడికల్ గ్యాస్ ప్లాంట్, బయోమెడికల్ గ్యాస్ ప్లాంట్, లాండ్రీ, ఆస్పత్రి కిచెన్‌ల నిర్మాణం ప్రారంభమైంది. నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ(ఎన్‌సీసీ) నిర్మాణపనులు చేపడుతోంది. జనవరిలో నిర్మాణం ప్రారంభమైంది. ఇంకో రెండేళ్లలో పూర్తిచేయాలన్నదే లక్ష్యం.

– డి.ఎ నాయుడు, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

8 నుంచి నియోజకవర్గ స్థాయి సీఎం కప్ పోటీలు



యువకులకు క్రికెట్ కిట్ అందిస్తున్న విప్ ధర్మశ్రీ, సీఐ ఇలియాస్ మహమ్మద్

రావికమతం: మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా వచ్చే నెల 8 నుంచి నియోజకవర్గ స్థాయిలో సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ విజ్ఞప్తి మేరకు టి.అర్జాపురంలో యువకులు మంగళవారం ఆయన క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ శారీరక శ్రమ కలిగించే క్రికెట్, వాలీబాల్,కబడ్డీ తదితర క్రీడలపై యువత దృష్టి సారించాలన్నారు.ఇటీవల మృతిచెందిన వైఎస్సార్ నేత మత్స కనకారావు జ్ఞాపకార్థం ఈ కిట్‌ను అందజేసినట్టు చెప్పారు. మరో రెండు కిట్లు త్వరలో అందజేస్తామన్నారు.కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ మాట్లాడుతూ మత్తుకు యువకులు బానిసలు కావద్దని సూచించారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న జైలు సూపరింటెండెంట్

ఆరిలోవ: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి విశాఖ కేంద్ర కారాగారంలో మంగళవారం వైద్య శిబిరం ప్రారంభించింది. రెండు రోజుల పాటు కొనసాగే ఈ శిబిరంలో సుమారు 1,700 మంది ఖైదీలకు హెచ్ఐవీ, టీబీ, హెపటైటిస్–బి తదితర పరీక్షలు చేస్తున్నారు. ఖైదీల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు జైలు సూపరింటెండెంట్ కిశోర్ కుమార్ తెలిపారు. ఎవరికైనా ఆయా వ్యాధులకు సంబంధించిన లక్షణాలు బయటపడితే వెంటనే వైద్యం అందిస్తామన్నారు.

జగనన్న ఆణిముత్యాలు వీరే..

- జిల్లా విద్యార్థినులకు సీఎం ప్రశంస

సాక్షి, అనకాపల్లి: పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన జిల్లావిద్యార్థినులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ప్రశంసలు పొందారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం విజయవాడలో వీరు సీఎం నుంచి ప్రోత్సాహకాలతోపాటు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఇంటర్మీడియట్‌లో ముగ్గురు, పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో మొదటి, ద్వితీయ బహుమతులను ఐదుగురు పొందారు.

మాకవరపాలెం: రోలుగుంట మండలం కంచుగుమ్మల గ్రామానికి చెందిన బి.రాజ్యలక్ష్మి మాకవరపాలెం కేజీబీవీలో చదువుతూ ఇంటర్‌లో 980 మార్కులు సాధించింది. సీఎం నుంచి ఆమెతోపాటు పాఠశాల ఎస్‌వో వై.త్రివేణి ప్రశంసా పత్రాలు అందుకున్నారు.



ఇంటర్‌లో ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థినులు వి. భాగ్యశ్రీ, సీహెచ్. పావని, రాజ్యలక్ష్మి



పదిలో మొదటి బహుమతి, ప్రశంసా పత్రం అందుకుంటున్న వి. భాగ్యశ్రీ, ద్వితీయ బహుమతి, ప్రశంసా పత్రం అందుకుంటున్న రొంగలి నిఖిత, పుట్టేపు లలిత, వెన్నెల తులసి, సింగంపల్లి తనూజ

పీహెచ్‌సీలో ప్రసవాలు పెంచాలి



సైలేజ్ పాతర గడ్డి తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



పశు వైద్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కశింకోట: కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మంగళవారం కశింకోటలో పర్యటించి, పీహెచ్‌సీ, పశువైద్య కేంద్రం, మినీడెయిరీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ల్యాబ్, ఫార్మసీ గది,ఆపరేషన్ థియేటర్, వార్డు గది, నర్సింగ్ కార్యాలయం, వైద్యుల గదులను పరిశీలించారు. పీహెచ్‌సీ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అన్ని అంశాల్లో పీహెచ్‌సీ రెండు నెలల క్రితం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని వైద్యాధికారి తిరుపతిరావు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఎ.ఎ.ఖాన్, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పశు వైద్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. మందుల బడ్జెట్ పెంచాలని, జిల్లాలోని 27 పశు వైద్య కేంద్రాల్లో మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని జిల్లా పశు వైద్యాధికారి బి.ప్రదసాదరావు కలెక్టర్‌కు నివేదించారు. కశింకోట శారదానది అవతల పొలాల్లో ఉన్న అభ్యుదయ పాడి రైతు ఆళ్ల అప్పలనాయుడు నిర్వహిస్తున్న మినీ డెయిరీని, సైలేజ్ గడ్డి తయారీ యంత్రం, మేలుజాతి గడ్డి పెంపక క్షేత్రాలను పరిశీలించారు. గడ్డి పెంపకానికి ఉపాధి హామీ పథకంలో ప్రోత్సాహకం కల్పించాలని కలెక్టర్‌ను రైతు అప్పలనాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో జగనన్న పాల వెల్లువ నోడల్ అధికారి డాక్టర్ భానుబాబు, పశు వైద్యాధికారి అల్ఫొన్సా జార్జ్, ఉప తహసీల్దార్ సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలు

- సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

కె.కోటపాడు : భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి రానున్నట్టు కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. గొండుపాలెం గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ వాల్యూ, స్టాంపు డ్యూటీ తదితర అంశాలతో పాటు మార్టిగేజ్, గిఫ్ట్ రిజిస్ట్రేషన్, వీలునామా రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శంకర్, పంచాయతీ కార్యదర్శి సునీత పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ సేవలపై అవగాహన కల్పిస్తున్న సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

జయహో.. జగన్నాథ



అనకాపల్లిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథయాత్రను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, దాడి రత్నాకర్

- ఘనంగా రథోత్సవం

అనకాపల్లిటౌన్/చోడవరం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో జగన్నాథుని రథయాత్ర అంగరంగవైభవంగా సాగింది. భక్తుల జయజయధ్వానాల మధ్య జగన్నాథుని రథచక్రాలు ముందుకు కదిలాయి. స్వామి నామస్మరణతో వీధులు మార్మోగాయి. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనకాపల్లి పట్టణం గవరపాలెంలోని జగన్నాథస్వామి ఆలయంలో స్వామిని మంగళవారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రథోత్సవాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు ప్రారంభించారు. గవరపాలెం నుంచి గూడ్స్‌రోడ్డులో గల ఇంద్రద్యుమ్న హాలు వరకు రథయాత్ర సాగింది. ఈ సందర్భంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ ఇంద్రద్యుమ్న హాలులో స్వామికి 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ మాట్లాడుతూ సోమవారం రాత్రి జగన్నాథస్వామి ఆలయంలో వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈనెల 29న ఆలయం వద్ద భారీ అన్నసమారాధన, తిరుగు రథోత్సవాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో 80, 81 వార్డు కార్పొరేటర్లు పీలా లక్ష్మీసౌజన్య రాంబాబు, కొణతాల నీలిమ భాస్కర్, ఆలయ అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సూరిశెట్టి రమణఅప్పారావు, కొణతాల మురళీకృష్ణ, యల్లపు చంద్రమోహన్, ఆళ్ల నాగేశ్వరరావు, రేబాక మధుబాబు, కోటిపల్లి జేజిబాబు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



చోడవరంలో జగన్నాథస్వామి రథయాత్ర

శోభాయమానంగా..

చోడవరంలో జగన్నాథుని రథయాత్ర ఘనంగా జరిగింది. కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఉపాలయంలో వేంచేసియున్న జగన్నాథస్వామి రథయాత్ర, దశావతార దర్శన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య రథయాత్రను శోభాయమానంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ట్రస్టు బోర్డు చైర్మన్ అలమండ ఈశ్వరరావు, దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో ఈ ఉత్సవం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ బోళ్లవీధి రామాలయం ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామివారి దశ అవతార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. రథయాత్రలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఆలయ మాజీ చైర్మన్లు జ్యోతుల రమేష్, ఉప్పలబాబు, ట్రస్టు బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు.దశావతార దర్శన ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు బుధవారం మత్స్యావతారంలో స్వామి భక్తులకు దర్శనమిస్తారు.

క్లుప్తంగా

1400 లీటర్ల సారా పులుపు ధ్వంసం

పాయకరావుపేట : నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామ పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 1400 లీటర్లు సారా పులుపు ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ ఎస్ఐ ఎం.రామేశ్వరరావు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు అనకాపల్లి డీటీఎఫ్ మీరా సాహేబు, క్యూఆర్‌టి సిబ్బంది, ఎస్ఈబీ సిబ్బంది ఒకేసారి దాడులు నిర్వహించి సారా తయారీకి నిల్వ చేసిన బెల్లం పులుపును ధ్వంసం చేయడం జరిగిందన్నారు. పులుపు నిల్వ చేసిన డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పాపికొండల అభయారణ్యం పరిశీలన

దేవీపట్నం: గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో విస్తరించిన పాపికొండల జాతీయ అభయారణ్యాన్ని అటవీశాఖ ఉన్నతాధికారులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని పోశమ్మ గండి నుంచి పర్యాటక బోటుపై అదనపు ముఖ్య అటవీ అరణ్యాధికారి (వైల్డ్‌లైఫ్) శాంతి ప్రియ పాండే, రాజమండ్రి సీసీఎఫ్ శర్వానంద్, రంపచోడవరం డీఎఫ్‌వో నరేందరన్, ఏలూరు డీఎఫ్‌వో రవీంద్ర ధామా, చింతూరు డీఎఫ్‌వో సౌజన్య, రంపచోడవరం సబ్ డీఎఫ్‌వో భరణి, పోలవరం, ఇందుకూరు, చింతూరు, కుక్కునూరు, వీఆర్‌పురం రేంజ్ అధికారుల బృందం పాపికొండల ప్రాంతానికి తరలివెళ్లారు. పశ్చిమగోదావరి జిల్లా వైపు గల కొరుటూరు కాటేజీలను తనిఖీ చేశారు. పాపికొండల నేషనల్‌పార్కు పరిధిలో గల దాసన్నపేట రోడ్డును పరిశీలించారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు

- దరఖాస్తుకు 26 వరకు గడువు

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి కౌశల్ యోజన(పీఎంకేవీవై)లో మూడు నెలల స్వల్పకాలిక కోర్సులు ఉచితంగా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ టెన్త్ ఉత్తీర్ణత లేదా, ఆపై చదువుకుని 18 నుంచి 30 సంవత్సరాల వయసు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు విద్యార్హత, ఆధార్ జెరాక్స్‌లతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈనెల 26వ తేదీ నాటికి ఐటీఐలో అందజేయాలని ఆయన కోరారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



మండల సమావేశంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు సమస్యలు వివరిస్తున్న ఎంపీటీసీ అలివేణి

- జగనన్న ఇళ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత
- 85 అంగన్‌వాడీ కేంద్రాల్లో స్మార్ట్ టీవీల ఏర్పాటు
- మండల సమావేశంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్ : గ్రామాల్లో ప్రధాన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. నవరత్నాల అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణం, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు, గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేల భవన నిర్మాణ పనులపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో మంగళవారం జరిగిన 8వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాల కల్పన, విద్యా బోధన జరుగుతోందన్నారు. తాజాగా 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ క్లాస్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు.

మండలంలోని 85 అంగన్వాడీ కేంద్రాల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయడానికి సమావేశంలో తీర్మానం చేశారు. సొంత స్థలాల్లో ఎవరైనా ఇళ్లు నిర్మించుకోవాలంటే తక్షణమే మంజూరు చేసేలా అధికారులను ఆదేశించినట్టు మంత్రి తెలిపారు. ఇంటికి శంకుస్థాపన చేస్తే రూ.20 వేలు అడ్వాన్సుగా ఇస్తున్నట్టు పేర్కొన్నారు. సచివాలయాల పరిధిలో పూర్తి చేసిన నిర్మాణపనులకు 100 శాతం బిల్లులు చెల్లించామన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రధాన రహదారులన్నీ దాదాపుగా పూర్తి చేశామని, మాకవరం, బవులువాడ, దర్జీనగర్ వద్ద పెండింగ్‌లో ఉన్న రహదారుల పనులకు ప్రతిపాదనలు ఆమోదించి, త్వరితగతిన చేపడతామన్నారు.

మండలంలో జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.21.50 కోట్లతో 121 పనులు పూర్తి చేసి, త్వరలో 24,212 ఇళ్లకు కుళాయిలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఎవరైనా అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే అధికారులు ప్రత్యేక క్యాంపు ద్వారా వారికి అక్కడికక్కడే సంక్షేమ పథకాలకు ఎంపిక చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గైర్హాజరు అధికారులపై ఆగ్రహం

మండల సమావేశానికి గైర్హాజరైన గనుల శాఖతో పాటు కొన్ని శాఖల అధికారులు, ఉద్యోగులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు రెండు గంటలు ఆలస్యంగా వచ్చిన అటవీశాఖ ఉద్యోగిని మంత్రి నిలదీశారు. సమావేశం ఎన్ని గంటలకు ప్రారంభిస్తే మీరు ఎన్ని గంటలకు వచ్చారు? క్లాస్ రూమ్ అనుకుంటున్నారా? అంటూ ప్రశ్నించారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో నరసింహారావును ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి, పంచాయతీరాజ్ డీఈ జె వేణుగోపాల్, తహసీల్దార్ గంగాధరరావు, ఈవోపీఆర్డీ ధర్మారావు, ఏవో రంగాచారి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌ల వద్ద నిరంతర నిఘా

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మురళీకృష్ణ



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చెక్‌పోస్టుల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని ఎస్పీ మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. మిస్సింగ్, ఆచూకీ తెలియని మృతదేహాల కేసులు, పోక్సో కేసులపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. సాంకేతిక సాయంతో చోరీ కేసుల్లో ఆధారాలు సేకరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రమాదాలకు గల కారణాలు కనుగొని ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని ప్రమాదాలు పునఃరావృతం కాకుండా చూడాలన్నారు. దొంగతనాల కేసుల్లో రికవరీ శాతం పెరగాలని సూచించారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో నేరస్తులను పట్టుకోవడంలో మరింత శ్రద్ధ వహించాలని ఆదేశించారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ పాటించి నేరస్తులను త్వరితగతిన పట్టుకోవాలన్నారు. యాంటీ డ్రగ్ ట్రాఫికింగ్, సైబర్ క్రైం కేసుల్లో ఎక్కువగా గ్రామీణ యువతే బాధితులుగా ఉంటున్నారని, సైబర్ నేరాలపై మహిళా పోలీసుల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పరారీలో ఉన్న గంజాయి కేసుల్లో నిందితులను అరెస్టు చేయాలని, ఎన్.బి.డబ్ల్యూ రివ్యూ చేసి, అమలు చేయాలన్నారు. ప్రతిభ కనబరిచిన 23మంది అధికారులు, సిబ్బంది, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, అదనపు ఎస్పీ (క్రైమ్) పి.సత్యనారాయణ రావు, నర్సీపట్నం సబ్ డివిజన్ అదనపు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ వి.సుబ్బరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, అనకాపల్లి దిశా డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు, ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు చంద్రశేఖర్, లక్ష్మణ్ మూర్తి, పైడపునాయుడు, అప్పలనాయుడు, రామకృష్ణారావు, వెంకటరావు,ఎస్ఐలు భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

సంగీతమే నా ప్రపంచం

- సంగీత దర్శకుడు ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్
- నేడు ప్రపంచ సంగీత దినోత్సవం



లక్ష్మీశ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్: మనిషిని కదిలించి, కరిగించే మహత్తర శక్తి సంగీతానిది. ఆనందం, ఆవేశం, వినడం, విషాదం, సమయ సందర్భమేదైనా దానికి గళమిచ్చేది సంగీతం, బలమిచ్చేది సంగీతం. అందుకే పాటలేని ప్రపంచాన్ని ఊహించలేము. అదే తన ప్రపంచంగా ఎంతోమందికి శిక్షణ ఇస్తున్నాడు సంగీత దర్శకుడు ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్. తన కుటుంబంలో నాలుగు తరాలుగా సంగీత కళాకారులే కావడంతో ఆయనకు ఈ రంగంపై బాల్య దశలోనే మక్కువ కలిగింది. దాంతోనే 2022 జూన్ 21న అనకాపల్లి పట్టణంలోని ఉడ్‌పేటలో కల్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ప్రారంభించారు. దాన్ని 21 సంవత్సరాలుగా నిర్వహిస్తూ.. మధుర గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సినీ గేయ రచయిత చంద్రబోస్, సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌ల ప్రోత్సాహంతో ఇప్పటికే 300కుపైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

ఎంతోమందికి శిక్షణ..

2004లో మాడుగుల మోదకొండమ్మ భక్తిగీతాలు స్వరపరచడంతోపాటు ఇప్పటి వరకు చాలా ఆల్బమ్స్‌కు సంగీతాన్ని అందించారు. అందమైన ప్రేమ కథ, తొలి పరిచయం, రూమ్ నంబర్ -7, మావూరి దైవం, తదితర చిత్రాలకు సంగీతమందించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ అతడి కుమారుడికి నామకరణం పెట్టడం ఒక మధురజ్ఞాపకంగా చెబుతున్నారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ఎంతోమందికి కళల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. మంచి కళాకారులుగా తీర్చిదిద్ది భావితరాలకు సంగీత కళను పరిచయం చేయాలనే ఉద్దేశంతో సంగీత అకాడమీని నడుపుతున్నారు. ప్రస్తుతం సంగీతం, కీబోర్డు, గిటార్, కూచిపూడి నృత్యం, వెస్ట్రన్‌డ్యాన్స్, వయోలిన్, తబలా, సింగింగ్, డ్రాయింగ్, పెయింటింగ్‌లలో పలువురికి శిక్షణ ఇస్తున్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.23 కోట్లు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 32 రోజులకు గాను 2కోట్ల 23లక్షల 32వేల 228 రూపాయలు వచ్చినట్టు ఈవో డి.భ్రమరాంబ తెలిపారు. సింహగిరిపై స్వామివారి ఆలయ బేడా మండపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 206 గ్రాముల బంగారం, 16.732 కిలోల వెండి లభించినట్టు ఈవో పేర్కొన్నారు. దేవస్థానం అధికారులు, సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.

22న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

మహారాణిపేట: మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ నెల 22న విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి ఉదయం 10.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా విశాఖ పోర్టు గెస్ట్‌హౌస్‌కు వస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు పోర్టు గెస్ట్‌హౌస్ నుంచి బయలు దేరి సాగర్‌నగర్‌లోని ఇంటికి చేరుకుంటారు. సాయంత్రం 6.30 గంటలకు పోర్టు గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. 23న ఉదయం 8.25 గంటలకు సాగర్‌నగర్‌లోని విజయ శంకర్ ఇంటికి వెళ్తారు. 10.30 గంటలకు రుషికొండ ఏ వన్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30గంటలకు తిరిగి పోర్టు గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. 25న సాయంత్రం నాలుగున్నర గంటలకు అనకాపల్లి జిల్లా వి.వి.రమణ రైతు భారతి కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 26న ఉదయం 7.30గంటలకు విమానంలో హైదరాబాద్ బయలు దేరుతారు.

ముద్దుర్తిలో మరో విషాదం

- రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య ఐదుకు చేరిక



ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సత్యనారాయణ

చోడవరం రూరల్ : కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి గ్రామం వద్ద శనివారం తెల్లవారు జామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మూడు రోజులపాటు ఆస్పత్రుల్లో మృత్యువుతో పోరాడిన బోడి సత్యనారాయణ మంగళవారం ఉదయం తుది శ్వాస విడిచాడు. దీంతో రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య ఐదుకు చేరుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను రాజమండ్రి ఆస్పత్రిలో చేర్చి ప్రథమ చికిత్స జరిపారు. ఆదివారం అక్కడి నుంచి విశాఖలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి సోమవారం రాత్రి విశాఖ కింగ్ జార్జి ఆస్పత్రికి తరలించారు. అయినప్పటికీ మంగళవారం ఉదయం సత్యనారాయణను మృత్యువు కబళించిందని గ్రామ సర్పంచ్ కె.వెంకట్, మాజీ సర్పంచ్ అప్పికొండ సోమేశ్వరరావు(లింగబాబు) తెలిపారు. మృతుడు సత్యనారాయణకు భార్య వరలక్ష్మి, డిగ్రీ చదువుతున్న పెద్ద కుమార్తె ఉమా మహేశ్వరి, ఇంటర్ చదువుతున్న రెండో కుమార్తె రమ్య, ఏడో తరగతి చదువుతున్న కుమారుడు నందిగోపాల్ సంతానం. తనకు ఉన్న కొద్దిపాటి పొలంలోనే వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. పిల్లలకు వివాహ వయసు వచ్చినా వారిని ఉన్నతంగా చదివించాలన్న తపనతో ఉండేవాడని, వారికి ఇపుడు ఆ దేవుడే దిక్కని గ్రామస్థులు కంట తడి పెడుతున్నారు. కేజీహెచ్‌లో పంచనామా, పోస్టుమార్టంలను పూర్తి చేసుకుని మంగళవారం సాయంత్రానికి సత్యనారాయణ భౌతిక కాయాన్ని ముద్దుర్తి తరలించారు. ఈ సంఘటనతో ముద్దుర్తి మరోమారు విషాదంలో మునిగిపోయింది.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక పండగలు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

మాడుగుల: గ్రామాల్లో ఏటా నిర్వహించే పండగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలో జమ్మాదేవిపేటలో మంగళవారం గోషమాంబ పండుగ ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తిలతో కలిసి ఆయన ఇక్కడ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

యాచకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని చూపిస్తున్న సీఐ సుధాకర్, పక్కన ఎస్ఐ లక్ష్మణ్‌రావు

పాడేరు రూరల్ : పాడేరు పట్టణంలోని సోమవారం రాత్రి జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్టు పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు. హత్య వివరాలను సీఐ సుధాకర్ వెల్లడించారు. పాడేరు పట్టణంలోని పలు దేవాలయాల వద్ద బిక్షాటన చేసే సాధువు అతిరాసి ప్రసాద్ పేరు తెలియని మరో సాధువు తరచుగా ఎగతాళి చేసేవాడన్నారు. ఈ క్రమంలో సోమవారం పాడేరు పట్టణంలోని టీ జంక్షన్ వద్ద ఇరువురు మధ్య ఘర్షణ చోటు చేసుకుందన్నారు. స్థానికులు గొడవను సద్దుమణిగించిన తర్వాత ఇరువురు మరోసారి ఘర్షణకు దిగారన్నారు. దీంతో ప్రసాద్ అతనిపై కోపం పెంచుకొని కేవీఆర్ లాడ్జికి ఎదురుగా రహదారిపై తన వద్ద పండ్లను కోసుకునేందుకు ఉపయోగించే కత్తితో దాడి చేసి హత్య చేశాడన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించామన్నారు.

బవులవాడ వద్ద దారి దోపిడీ

- వ్యాన్‌ను అడ్డగించిన 10 మంది దుండగులు
- విశాఖకు చెందిన వస్త్ర వ్యాపారి నుంచి రూ.15 వేలు దోపిడీ
- పెదబయలు సంతకు వెళ్లి వస్తుండగా ఘటన

అనకాపల్లి టౌన్ : వస్త్ర వ్యాపారి వద్ద నుంచి 10 మంది వ్యక్తులు దారి దోపిడీ చేసి రూ.15వేల నగదు చోరీ చేశారు. స్థానికులు, వస్త్రవ్యాపారి కథనం మేరకు వివరాలివి. విశాఖకు చెందిన రాంబాబు వస్త్ర వ్యాపారం చేస్తుంటారు. సోమవారం వ్యాపారి కుమారుడు మహేష్, వ్యాన్ డ్రైవర్ నాగు, వర్కర్ సతీష్‌లు మినీ వ్యాన్‌లో వస్త్రాలు లోడు చేసి విశాఖ నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు సంతకు వెళ్లారు. సంత ముగిసిన తర్వాత అదే రోజు రాత్రి పెదబయలు నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ వెళ్తుండగా మార్గం మధ్యలో మండలంలో బవులవాడ గ్రామం వద్ద గుర్తు తెలియని పది మంది వ్యక్తులు వ్యాన్‌ను అడ్డగించారు. ఇంతలో ఒక వ్యక్తి వ్యాన్‌ను తీసుకొని నలుగురు వ్యక్తులతో వ్యాన్‌లో అనకాపల్లి జాతీయ రహదారి తోటాడ జంక్షన్ వరకు తీసుకెళ్లిపోయాడు. వ్యాన్ వెనుక మిగిలిన తొమ్మిది మంది ద్విచక్ర వాహనాలపై వచ్చారు. తోటాడ జంక్షన్ సమీపంలో రాంబాబు నుంచి రూ.15వేలు నగదు తీసుకొని దుండగులు ఉడాయించారు. దీంతో చేసేది ఏమీలేక వ్యాపారి రాంబాబు వ్యాన్ తీసుకొని విశాఖ వెళ్లిపోయాడు. విశాఖలో కలెక్టర్ కార్యాలయంలో డీపీఆర్ విభాగంలో పని చేస్తున్న ఓ వ్యక్తి సహాయంతో మంగళవారం రాత్రి స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా తమకు సమాచారం ఇప్పుడే వచ్చిందని పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

నాలుగు గంటల్లోనే చోరీ కేసు ఛేదన



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ సునీల్

బీచ్‌రోడ్డు: చోరీ జరిగిన నాలుగు గంటల వ్యవధిలోనే పోలీసులు కేసును ఛేదించి.. నిందితుడి నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఈ కేసు వివరాలను తూర్పు ఏసీపీ సునీల్ మీడియాకు వెల్లడించారు. మంగాపురంకాలనీ తారా మసీదు రోడ్డులో ఓ వీధిలోని ఒక ఇంట్లో రూ.12 వేలు, మరో ఇంట్లో రూ.19,200 విలువైన బంగారం ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దీంతో బాధితులు డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. విచారణ ప్రారంభించిన మూడో పట్టణ పోలీసులు సీసీ పుటేజీ ద్వారా కేవలం నాలుగు గంటల వ్యవధిలో నిందితుడు మరడ సాయి(సార పిట్టలు)ను అదుపులోకి తీసుకున్నారు. కొమ్మాది ప్రాంతానికి చెందిన సాయి చెడు వ్యసనాలకు బానిసై.. దొంగతనాలు చేయడం ద్వారా వచ్చే సొత్తుతో జల్సాలు చేస్తున్నాడు. ఈ రెండు కేసుల్లో సాయి స్క్రూడ్రైవర్ సాయంతో ఇళ్ల తలుపులు తీసి.. బీరువాలోని నగలను చోరీ చేసినట్లు ఏసీపీ తెలిపారు. పెదజాలరిపేట వద్ద సాయిని చాకచక్యంగా పట్టుకున్నట్లు చెప్పారు. అతనిపై రెండు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా.. సాయిపై ఇప్పటికే 13 కేసులు నమోదై ఉన్నాయి. ఈ కేసును ఛేదించిన ఎస్ఐ సురేష్ కుమార్, ఏఎస్ఐ కిశోర్ కుమార్, కానిస్టేబుల్ అప్పలరాజు, రవికుమార్‌లను ఏసీపీ అభినందించారు.

పాడేరు రోడ్డులో జీపు-బైక్ ఢీ



కె.కోడాపల్లి గ్రామ సమీపాన ఎదురెదురుగా వస్తూ ఢీకొన్న జీపు, బైక్



గాయపడిన నారాయణ



ప్రమాదంలో మృతి చెందిన చిన్నయ్య

- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

జి.మాడుగుల : పాడేరు-జి.మాడుగుల రోడ్డు మార్గంలో మంగళవారం ప్రైవేటు జీపు, బైక్ ఎదురెదురుగా వస్తూ ఢీ కొన్న సంఘటనలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడి మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మండలంలో కె.కోడాపల్లి గ్రామ సమీపాన గల రోడ్డు మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. పాడేరు నుంచి జీపులో ప్రయాణికులను ఎక్కించుకొని జి.మాడుగుల వైపు వస్తుండగా అదే సమయంలో జి.మాడుగుల నుంచి పాడేరు వైపు పాడేరు మండలం ఇరడాపల్లి పంచాయతీ సరియాపల్లి గ్రామానికి కె.చిన్నయ్య(30), కోడా నారాయణ కలసి బైక్‌పై వెళుతుండగా కె.కోడాపల్లి సమీపంలో ఎదురెదుగా వస్తూ ఢీ కొన్నాయి. దీంతో బైక్‌పై వెళుతున్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో చిన్నయ్య మృతి చెందగా, నారాయణ పరిస్థితి విషమంగా ఉందని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రమాద సంఘటనపై సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ

పాడేరు నుంచి జి.మాడుగులకు మంగళవారం మధ్యాహ్నం పాడేరు ఏఎస్పీ ధీరజ్ వాహనంలో వస్తుండగా కొంత సమయం ముందు జీపు-బైక్ ఢీకొన్న ప్రమాద స్థలాన్ని ఆయన పరిశీలించారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వేగాన్ని తగ్గించి ప్రమాదాల నివారణకు దృష్టి సారించాలని అన్నారు. గిరిజన ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగింపు (బుష్ క్లియరెన్స్) విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. రోడ్డు మార్గంలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు పిచ్చి మొక్కలు, తుప్పల వల్ల కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

గోపాలపట్నం: నాలుగేళ్ల బాలికపై 60 ఏళ్ల చినప్పారావు అత్యాచారం చేసేందుకు యత్నించాడు. ఎన్ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ దిగువన ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివీ..ఎన్ఏడీ ఫ్లై ఓవర్ దిగువన యాచకుడు సతీష్, భార్యాపిల్లలతో కొన్నాళ్లుగా నివాసముంటున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య పెద్ద కూతురితో వెళ్లిపోయింది. తండ్రితోనే చిన్న కుమార్తె ఉంది. మంగళవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో చిత్తు కాగితాలు ఏరుకునే కంచరపాలెం ప్రాంతానికి చెందిన చినప్పారావు నిద్రిస్తున్న చిన్నారిని ముద్దులాడుతూ కనిపించాడు. అటుగా వెళ్తున్న ఓ మహిళ ఇది గమనించి.. ప్రేమతో ముద్దులాడుతున్నాడని అనుకుంది. అయితే బాలికపై అత్యాచారానికి యత్నిస్తున్నట్లు గమనించి కేకలు వేసింది. చిన్నపిల్లరా అంటూ అతన్ని కొట్టింది. ఇంతలో తండ్రి నిద్ర లేచి అతనికి దేహశుద్ధి చేశాడు. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వృద్ధుడిని స్టేషన్‌కు తరలించారు. సీఐ బీఎండీ ప్రసాద్ ఘటనా స్థలానికి వచ్చి విచారించారు. తాగిన మత్తులో ఈ విధంగా ప్రవర్తించాడని స్థానికులు చెబుతున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ చార్జీలు తగ్గించాలని వినతి



మంత్రి అమర్‌నాథ్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

అనకాపల్లి రూరల్ : పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అనకాపల్లిలో సీపీఐ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు నేతృత్వంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు అప్పలరాజు, సన్యాసిరావు, రాజు, ఫణీంద్రకుమార్, ఈశ్వరరావు, ఎం.సత్తిబాబు, సాయి, రామారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

25న యోగాసనాల పోటీలు

అనకాపల్లిటౌన్: స్థానిక రింగ్‌రోడ్డు శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ ఉచిత ధ్యాన, యోగా సెంటర్‌లో ఈ నెల 25న ఉదయం 7 గంటలకు యోగాసనాల పోటీలు నిర్వహించనున్నట్లు యోగా శిక్షకుడు బి.అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 7 విభాగాల్లో జరుగుతాయన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు.

చలివేంద్రం నిర్వాహకుడికి సత్కారం



అప్పారావును సత్కరిస్తున్న మాజీ మునసబు సన్యాసినాయుడు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో మజ్జిగ చలివేంద్రాన్ని రెండున్నర నెలలుగా నిర్వహిస్తూ, సేవలందిస్తున్న పిల్లి అప్పారావును స్థానికులు మంగళవారం సత్కరించారు. వేసవి దృష్ట్యా ల్యాబ్ శ్రీను ఆధ్వర్యంలో 71 రోజుల క్రితం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో ఎండను సైతం లెక్క చేయకుండా అప్పారావు నిర్వహించారు. దీంతో ఆయన్ని మాజీ మునసబు చిన్ని సన్యాసినాయుడు దుశ్శాలువా కప్పి, అభినందించారు. కార్యక్రమంలో గ్రామ యువత చిన్ని రాజీవ్, రెడ్డి నాగేశ్వరరావు, లగిశెట్టి శ్రీను, కడియాల తేజ, పెదపాటి కిరణ్, ఉపేంద్ర, వెలగా రాజీవ్, గాడి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 264 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	3,980	3,980
మూడోరకం	---	---

అనకాపల్లి సినిమాలు

ఆదిపురుష్	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
ది ఫ్లాష్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
ఆదిపురుష్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 349 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 315 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

జగనన్న ఇళ్లకు ముందస్తు రుణం

పేదల సొంతింటి కలను నవరత్నాల్లో ఒకటైన పేదలందరికీ ఇళ్లు పథకం నెరవేరుస్తోంది. వైఎస్సార్-జగనన్న కాలనీల్లో ఇప్పటికే ఇళ్ల పట్టాలు అందించారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారి కోసం ప్రభుత్వమే ఇళ్లు కట్టిస్తోంది. అవసరమైన నిర్మాణ సామగ్రి అందిస్తోంది. ఇపుడు నిర్మాణ ప్రగతితో సంబంధం లేకుండా ముందస్తు రుణంగా రూ.20 వేలు అందిస్తోంది.



శంకరంలోని జగనన్న కాలనీలో వివిధ దశలలో ఉన్న ఇళ్ల నిర్మాణం

- ఇళ్ల నిర్మాణం వేగవంతానికి చర్యలు
- రూ.20 వేలు ముందస్తు రుణం మంజూరు
- మండలంలో 3,389 మంది పట్టాదారులకు లబ్ధి

తుమ్మపాల : పేదల పాలిట పెన్నిధిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారు. తన పాలనలో తనకంటూ సొంతంగా ఓ గూడులేని పేదవాడు ఉండకూడదనే లక్ష్యంతో కృషిచేస్తున్నారు. ఇప్పటికే లక్షల్లో ఇళ్ల పట్టాలందించారు. చాలా మంది ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. ప్రభుత్వం వారికివ్వాల్సిన రూ.లక్షా 80 వేలను నిర్మాణ స్థాయిల ఆధారంగా చెల్లిస్తోంది. ఇపుడు అడ్వాన్స్ రూపంలో రుణం మంజూరు చేసేందుకు కొత్తగా వెసులుబాటు కల్పించింది.

లబ్ధిదారులకు భరోసా

వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న లబ్ధిదారుల్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు ముందస్తు రుణం రూ.20 వేలు ప్రకటించింది. దీంతో అనకాపల్లి మండలంలో సుమారు 450 మంది లబ్ధిదారులు ముందస్తు రుణానికి దరఖాస్తు చేసుకున్నట్టు అధికారులు చెప్తున్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 48 జగనన్న లే అవుట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ స్థలాలు లేని చోట, ప్రైవేట్ భూముల్ని కొనుగోలు చేసి మరీ.. పేదల కోసం లేఅవుట్లు వేశారు. మండలంలో మొత్తం 3,389 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేశారు. కరోనా, ఇటీవల వర్షాల కారణంగా మందకొడిగా సాగిన ఇళ్ల నిర్మాణం ఇపుడిపుడే వేగం పుంజుకుంది. దాదాపు 2 వేల మంది లబ్ధిదారులు పునాదులు వేశారు. 900 ఇళ్లకు శ్లాబ్‌లు పూర్తయ్యాయి. ఇప్పటికే 300 మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుని, గృహప్రవేశాలు కూడా చేశారు.

ఇక త్వరితగతిన నిర్మాణాలు

పేదరికం, చేతిలో డబ్బుల్లేని కారణంగా నిర్మాణాలను మధ్యలోనే నిలిపేసిన, ఇప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారుల్లో ప్రభుత్వ తాజా నిర్ణయంతో జోష్ వచ్చింది. ఈ రుణంతో నిర్మాణాలను ప్రారంభించి, దశలవారీగా బిల్లులు పెట్టుకుని, ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల్ని రాబట్టుకోవచ్చు. దీంతో రానున్న రెండు మూడు నెలల్లో చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావచ్చని అధికారుల అంచనా. పనులు పూర్తయిన ఇళ్లకు వాటి ప్రగతి ఆధారంగా ప్రభుత్వం పేమెంట్ చెల్లిస్తోంది. ఒక్కో ఇంటికి రూ.లక్షా 80వేలతో పాటు, అదనంగా డ్వాక్రా మహిళలకు రూ.30 వేలు ప్రభుత్వం రుణ సౌకర్యం కల్పించింది. దీంతోపాటు గృహానికి అవసరమయ్యే ఐరన్, సిమెంట్, ఇసుకతో పాటు డోర్‌లు, కిటికీలు తదితర కలప కూడా అందిస్తోంది. తాజా నిర్ణయంతో నిర్మాణదారుల్లో మరింత భరోసా కలుగనుంది.

ఇంటి నిర్మాణం ప్రారంభిస్తా



జగనన్న ప్రభుత్వంలో సొంతింటి కోసం ఇంటి స్థలం మంజూరైంది. అయినప్పటికీ చేతిలో డబ్బుల్లేక ఇప్పటికీ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించలేకపోయాను. మాలాంటి వారి కోసమే సీఎం జగన్ ఇంటి పనులు ప్రారంభించేందుకు వీలుగా రూ.20 వేలు ఇస్తున్నట్టుంది. ఈ ముందస్తు రుణం మా ఇంటి పనులు ప్రారంభించేందుకు ఉపయోగపడుతుంది. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– మంత్రి సత్యవతి, గృహ లబ్ధిదారు, రేబాక

ముందస్తుగా రూ.20 వేల రుణం

నిబంధనల మేరకు నిర్మాణ పనులు పూర్తిచేసిన తర్వాతే విడతల వారీ చెల్లింపులు జరుగుతాయి. దీంతో కొందరు కనీస పెట్టుబడి లేక నిర్మాణాలు ప్రారంభించలేకపోతున్నారు. అలాంటి వారిని గృహ నిర్మాణం దిశగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంది. ముందస్తు రుణంగా రూ.20 వేలు అందించనుంది. దీంతో నిర్మాణాలు ఊపందుకోనున్నాయి.

– మురళి, ఏఈ, గృహ నిర్మాణ శాఖ

అర్హులైన వారందరికీ సంక్షేమం



బట్లపూడి ఆర్బీకేలో రైతుకు విత్తనాలు అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- అర్హత ఉండీ.. అందలేదనే పరిస్థితి లేకుండా చర్యలు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : నియోజకవర్గంలో అర్హత ఉండీ, ప్రభుత్వ పథకాలు అందలేదనే పరిస్థితి ఉండరాదని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో శంకరం పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీ, బట్లపూడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు అమలు తీరును తెలుసుకున్నారు. కుటుంబాల వారీగా ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో గణాంకాలతో సహా వివరించారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు.

గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి సబ్సిడీపై మంజూరైన విత్తనాలను రైతులకు అందించారు. గ్రామంలో తీవ్రమైన సోరియాసిస్ వ్యాధితో బాధపడుతున్న కె.రాకేష్‌కు అవసరమైన వైద్యం అందించేందుకు పూర్తి సాయం చేస్తానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ రూపురేఖలు మరాయన్నారు. అత్యుత్తమ విద్య, వైద్యాన్ని పేద ప్రజలకు కూడా అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు. జిల్లాను పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేసి, వేలాది మంది యువతకు ఉపాధి కల్పించినట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, శంకరం సర్పంచ్ పసుపులేటి లక్ష్మీరామకృష్ణ, ఉపసర్పంచ్ గుడాల తాతబాబు, బట్లపూడి సర్పంచ్ గొంతిన సాజవతి సత్యారావు, ఎంపీటీసీ ఎం.అప్పలనాయుడు, యాత కార్పొరేషన్ డైరెక్టర్ నొట్ల శంకర్ శేఖర్‌రావు, సచివాలయం కన్వీనర్ ఎంవీవీ గణేష్, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కనుల పండువగా జగన్నాథుని రథోత్సవం



కశింకోటలో జగన్నాథస్వామి రథోత్సవం

కశింకోట : కశింకోటలో మంగళవారం రాత్రి జగన్నాథస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక దేవదాయ, శాఖకు చెందిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం నుంచి అందంగా అలంకరించిన రథంపై జగన్నాథస్వామి, బలభద్రస్వామి, సుభద్రల ప్రతిమలను నిలిపి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి కోమటి వీధి, పెద బజారు, కస్పావీధి, అమరపల్లి వీధి, అగ్రహారం, జాతీయ రహదారి, సంతబయలు, గవరపేట, వడ్డివీధుల మీదుగా తిరిగి ఆలయం వరకు రథయాత్ర సాగింది. దారి పొడవునా భక్తి పారవశ్యంతో రథం లాగుతూ స్వామి వార్లను దర్శించి, భక్తులు తరించారు. ఉత్సవం సందర్భంగా ఆలయంలో వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ విగ్రహాలను పూలతో అలంకరించి విష్ణు సహస్రనామార్చన, ప్రత్యేక పూజలు జరిపారు. మండపంలో మత్స్యావతారంతో జగన్నాథస్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి, కన్నబాబు, రామ చరణాచార్యులు తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు విద్యుత్ నిలుపుదల

అనకాపల్లిటౌన్ : విద్యుత్ వైర్ల కింద జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా నిమిత్తం ఈ నెల 22న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈపీడీసీఎల్ డీ-2 పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఈఈ(ఆపరేషన్స్) కె.రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూకాంబిక అమ్మవారిగుడి రహదారి, చాకలిపేట, అగ్గిమర్రి చెట్టు, జగన్నాథ థియేటర్ ఏరియా, కోటవీధి, నవోదయ స్కూల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

ఇండోర్ స్టేడియంలో యోగా దినోత్సవం నేడు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో బుధవారం ఉదయం 6 నుంచి 8 వరకూ 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ వైద్యాలయ ఆయుర్వేద విభాగం వైద్యురాలు కె.లావణ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితోపాటు, పలువురు ప్రముఖులు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు.

3న నూకాంబిక ఆలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నారాయణమూర్తి, జగన్‌మోహనరావు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద జూన్ 3న లోక కల్యాణార్థం సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు భాగవతుల చాత్తాద శ్రీవైష్ణవ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పండా నారాయణమూర్తి తెలిపారు. గవరపాలెం సంఘం ఆవరణలో మంగళవారం సుదర్శన హోమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాత్తాద శ్రీవైష్ణవులను బీసీ-డీ నుంచి ఎంబీసీ(బాగా వెనుకబడిన తరగతులు)గా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. హోమం అనంతరం 50 మంది జంటలకు షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ముందూరు ఉదయ్‌కుమార్, వైద్యుడు జగన్‌మోహనరావు, తొండా నారాయణమూర్తి, టి.వి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తి కళాకారులకు కేంద్ర ప్రభుత్వం అండ



మాట్లాడుతున్న కొండమూరు బంగారుబాబు

అనకాపల్లిటౌన్ : విశ్వబ్రాహ్మణ చేతివృత్తి కళాకారులకు కేంద్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ముద్ర లోన్లను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీజేపీ ఆర్టిజన్ విభాగ కన్వీనర్ కొండమూరు బంగారుబాబు అన్నారు. గవరపాలెం కామాక్షిదేవి అమ్మవారి ఆలయంలో చేతివృత్తి కళాకారులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 బీసీ కులాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని, వాటిని విశ్వబ్రాహ్మణ చేతివృత్తి కళాకారులు వినియోగించుకోవాలన్నారు. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు రుణ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తుర్తి గంగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చేబోలు సూరిబాబు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సాగునీటి మదుం పనులు



కశింకోట పొలాల్లో సాగునీటి కాలువపై నిర్మిస్తున్న మదుం

కశింకోట : కశింకోటలోని శారదానది అవతల పొలాలకు నీరు వెళ్లేందుకు నిర్మిస్తున్న మదుం పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైతుల కోరిక మేరకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రూ.9 లక్షలు మంజూరు చేయడంతో శనివారంఒడ్డు వద్ద పైపులైన్ ఏర్పాటు, 3 మదుంల నిర్మాణంతోపాటు రోడ్డు పనులు చేపట్టారు. వీటి నిర్మాణం పూర్తి అయితే ఆయకట్టు రైతులకు సాగునీరు సమృద్ధిగా అందనుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మంగళవారం పరిశీలించారు.

సబ్బవరం ఎంఈవో-2 బాధ్యతల స్వీకరణ

సబ్బవరం: సబ్బవరం మండల విద్యాశాఖాధికారి-2గా బోళం సూర్యనారాయణమూర్తి మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకూ కె. కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-1 ఎస్. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. ఆయన్ను పీఆర్టీయూ సబ్బవరం మండల శాఖ ఆధ్వర్యంలో డి. శ్రీనివాసరావు అధ్యక్షతన సన్మానించారు.

జగనన్న సురక్ష ఇంటింటి సర్వే

కశింకోట : మండలంలోని తేగాడ గ్రామంలో జగనన్న సురక్ష పైలట్ ప్రాజెక్టు కింద ఇంటింటి సర్వే మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అధికారులు, గ్రామ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, సేవలు సవ్యంగా అందుతున్నాయా? లేదా? అందకపోతే అందుకు కారణాలు, పెండింగ్ జాబితా తదితర వివరాలను సేకరిస్తున్నారు. సర్వే ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందకపోతే సత్వరం అందేలా చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే లాంఛనంగా ప్రారంభించామని, వచ్చే నెల 1 నుంచి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ముత్యాలమ్మా.. చల్లంగ చూడమ్మా



ప్రత్యేక అలంకరణలో ముత్యమాంబ అమ్మవారు

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామంలో కొలువుదీరిన ముత్యమాంబ అమ్మవారి కంబాల పండగను మంగళవారం గంగపుత్రులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ముత్యమాంబను దర్శించుకొని పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కంబాల పండగను పురస్కరించుకుని సతకంపట్టులో ఏర్పాటు చేసిన కంబాలను కొట్టడడంతో పండగ పూర్తి అయినట్లు గంగపుత్రులు విశ్వసిస్తారు. పండగలో విశాఖ, అనకాపల్లి పట్టణ ప్రాంతాల నుంచే కాకుండా ముత్యాలమ్మపాలెం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పెద్ద ఎత్తున బాణసంచాకాల్పులు, బాజా భజంత్రీల నడుమ కంబాల పండగను అంగరంగ వైభవంగా జరిపారు. పండగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరవాడ సీఐ పి.ఈశ్వరరావు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నేడు

పరవాడ: వెన్నెలపాలెం కల్యాణ మండపంలో బుధవారం 10 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.హేమసుందరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయా లేదా అన్న విషయాలపై ఈ నెల 24 నుంచి గ్రామ స్థాయిలో జగనన్న సురక్ష సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సర్వేపై వలంటీర్లకు అవగాహన కల్పించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, అధికారులు పాల్గొంటున్నారని తెలిపారు.

అందరి సంక్షేమానికే జగనన్న సురక్ష



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులా వాణి

సబ్బవరం: సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలకు నోచుకోని వారికి కూడా పథకాలు అందించేందుకు కల్పించిన మరో అవకాశమే జగనన్న సురక్ష అని డీఎల్‌డీవో మంజులావాణి చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో పాటు గ్రామ వలంటీర్లకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీన్ని ఎంపీపీ బోకం సూర్యకుమారితో పాటు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంజులావాణి మాట్లాడుతూ వలంటీర్లంతా తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు విధి నిర్వహణలో వలంటీర్లు,సచివాలయ సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. అవసరమైతే విధుల నుంచి తొలగిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ నెల 24 తేదీ నుంచి వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నమోదు చేసుకుంటారని తెలిపారు. అనర్హులు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చినప్పుడు వారికి సైతం సహనంతో విధివిధానాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వ విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులందరికీ ప్రభుత్వ సేవలు అందే విధంగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు,తహసీల్దార్ బి. సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ సబ్బవరపు నారాయయణమూర్తి,ఈవోఆర్‌డీ మహేష్, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, ఏఎల్‌వో హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని వినతి



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

సబ్బవరం: ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లందరినీ రెగ్యులర్ చేయాలని మండలంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు డిమాండ్ చేశారు. జేఏసీ కార్యాచరణలో భాగంగా సబ్బవరంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు మూడు రోడ్ల కూడలిలోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మంగళవారం నివాళులర్పించి, వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ గోడును ఆలకించి, కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా అందరికీ న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి. వరప్రసాద్, ఎల్‌వీరమణ బాబు, కె. విజయ, నీలిమ తదితరులు ఉన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు'కు సత్కారం



తాళ్లపాలెం బాలికల గురుకుల పాఠశాలలో టెన్త్ టాపర్లకు సత్కారం

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించి టెన్త్‌లో ఉత్తమ మార్కులు పొందిన బాలికలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నగదు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, ప్రిన్సిపాల్ గ్రేసీ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థిని

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల హైస్కూల్లో టెన్త్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు మంగళవారం నగదు, ప్రశంసా పత్రాలు అందించారు. వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వెలుగుల మధుశ్రీ, పైలా పూజిత, భవానీలకు ఎంపీటీసీ కట్టమూరి శ్రీనివాసరావు, కోట్ని శివ, కాసు అంజిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.